

# ఆదివాసీ సంబురం నాగోబా వైభవం

ఆదివాసీల ఐక్యతారాగం... శిశిర రుతువులో విరిసే వసంతగానం... నాగోబా జాతర. ఇంద్రవెల్లి కానలో గోండు తెగకు చెందిన మెస్రం వంశీయులు మీసం మెలేస్తే... తెలంగాణమంతా పరవశించే ఘట్టం ఇది. తరతరాల ఆచారాలకు కాపుకాస్తూ... తాము నమ్మిన నాగరాజుకు కొమ్ముకాస్తూ... ఘనంగా జరిగే జనజాతరకు కేస్లాపూర్ స్వాగతం పలుకుతున్నది. ఈ నెల 28న మొదలవుతున్న నాగోబా జాతర ఐదు రోజులపాటు ఆదివాసీల జీవన వైచిత్రికి, నమ్మకాలకు అద్దం పడుతుంది.

ఆదివాసీల తెగువకు 'సమ్మక్క-సారలమ్మ' జాతర ప్రతీక అయితే.. 'నాగోబా జాతర' వారి ఆచారాలకు ఆలంబనగా నిలుస్తుంది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ వేదికగా జరిగే ఈ ఆదివాసీ సంబురం తెలంగాణలో రెండో అతిపెద్ద జాతరగా పేరొందింది. ఏటా పుష్యమాసంలో నెలవంక తొంగి చూడటంతోనే.. నాగోబా జాతరకు సన్నాహాలు మొదలవుతాయి. నెలవంక కనిపించిన రెండో రోజు మెస్రం వంశీయులు నాగోబాకు తొలిపూజలు చేస్తారు. తర్వాత ప్రత్యేకంగా తయారుచేసిన ప్రచార రథంలో వారం రోజులు గ్రామాల్లో తిరుగుతూ... జాతరకు హాజరు కావాల్సిందిగా మెస్రం వంశీయులను ఆహ్వానిస్తారు. జాతరకు పక్షం రోజుల ముందు ఈ మహత్తర క్రతువుకు శ్రీకారం చుడతారు. తమ దైవం నాగోబాకు అభిషేకానికి గానూ గంగాజలం

